# రాధ

శ్రీ ఎస్. ఎమ్. వాద్రేవ్

—(o)—

"శంకరం! నీ భార్య నింక తీసుకురావే మిత్రా?" తల్లి ప్రశ్నించింది:

"నేను వద్దన్నా కాని డబ్బాశకొద్దీ నాకా పిల్లను ముడెట్టారు. ఆ పిల్ల మొహం చూస్తే అసహ్యం దానంతటది పుట్టుకొస్తుంది. లోతుకుపోయిన కళ్లు; మొహం నిండా స్ఫోటకపు మచ్చలూను. డబ్బాశకొద్దీ మీరు ముడెట్టారు కనుక - మీరే అనుభవించండి. నేను తీసుకరాను. ఒక వేళ మీరే కనుక తీసుకువచ్చినట్టయితే దాని మొహం చూడను." అని చీదరించుకుంటూ శంకరం బయటకు వెళ్లిపోయాడు.

"సరే! అదేమిటో నేను చూస్తా."

♦ ♦ ♦

**కాకినాడలో** బాగా డబ్బున్న జమిందారు వెంకటేశంగారొక్కరే. ఆయనకు లేక లేక పుట్టిన ఆడపిల్ల రాధ. అన్నీవుండీ అయిదవతనం తక్కువన్నట్లు రాధకి అందం తక్కువ. అంటే మొహంనిండా స్ఫోటకపు మచ్చలు; కళ్లు లోతుగా నుంటాయి. కూతురు అందంగా లేక పోయినా లేక లేక పుట్టినందువల్ల కొడుకైనా, కూతురైనా రాధేనని చాలా గారాబంగా పెంచి పెద్ద చేశారు. వెంకటేశంగార్కి చదువులేనందువల్ల కలిగే బాధలు ఆయన అనుభవించారు గాబట్టి; రాధని స్కూలులో చేర్పించి స్కూల్ ఫైనలు వరకు మాత్రమే చదివించారు. రాధకి పెళ్లివయస్సు వచ్చింది. పెద్దమనిషి అయింది. రాధకి నచ్చిన పిల్లవానికిచ్చి ఎంతో వైభవంగా వివాహం జరిపించాలని వెంకటేశంగారికి కుతూహలంగావుంది. కానీ పిల్లను చూడగానే వచ్చిన ప్రతీ సంబంధం వెనక్కు తిరుగుతోంది. తల్లిదండ్రులు చాల బాధపడ్డారు. ఎంత డబ్బుంటే మాత్రం కురూపిని చేసుకుందుకు ఎవడిష్టపడతాడు. కానీ, కట్నానికి, పిల్లకి వచ్చే ఆస్థి చూసి ఎవరో ఒకరు చేసుకోపోతారా అని వెంకటేశంగారి గుండె ధైర్యం. ఎలాగయితేనేం సర్వవరంలో శంకరం అనే పిల్లాడికి యివ్వడానికి పెద్దలు నిశ్చయించుకుని తాంబూలాలు పుచ్చుకున్నారు. అల్లుడు మంచివాడు; బి. ఏ. చదువుకున్నవాడు దొరికాడని, రాధ అదృష్టవంతురాలని వెంకటేశం దంపతులు చాల సంతోషపడ్డారు. ఓ మంచి ముహూర్తాన వివాహం ఏ ఆటంకాలు లేకుండా జరిగిపోయింది. శుభకార్యం కూడ జయప్రదంగా జరిగింది. (శంకరానికి రాధంటే యిష్టం లేకపోయినా ఆ సమయంలో తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు.)

శంకరానికి ఈ సంబంధం యిష్టంలేదు. తల్లిదండ్రుల నూటిపోటి మాటలవల్ల; డబ్బాశవల్ల మూడు ముళ్ళూ వేశాడు. పెళ్లయిన వారం రోజులనుండి అత్తవారిల్లు చూడనేలేదు, భార్యచిత్రం హృదయంలో మెదిలేటప్పటికల్లా వళ్ళంతా తేళ్లు పాకుతున్నట్టవుతోంది. శంకరానికి మామగారి దగ్గర్నుంచి ఉత్తరాలు వస్తున్నాయి. కాని, జవాబులు వెళ్ళటంలేదు. తల్లిదండ్రులు వెళ్లమని యింట్లో తెగపోరు పెడ్తున్నారు. భరించలేకపోతున్నాడు. 'అవును-వాళ్ళకేం చెప్తారు-అనుభవించవలసింది నేను' అనుకున్నాడు శంకరం.

'వెంకటేశంగారు తన అల్లుడు రాకపోవడానికి కారణం తెలుసుకోలేక బాధపడుతున్నారు. అల్లుడు రాకపోవడం, రాధ దుఃఖం భరించలేక పోతున్నారు. చివరకు వెంకటేశంగారి అన్నగారి కొడుకు ద్వారా శంకరం వైనం తెలుసుకొని ఎంత బాధపడ్డారో చెప్పతరముకాదు. ఆయన లోపల ఏవేవో అనుకున్నారు. రాధ ఎంత బాధతో కృంగి కృశించి శల్యమయిపోయిందో ఎవరికి తెలుసు? ఒక అమాయకురాలి జీవితాన్ని ఎలా నాశనం చేశాడో వాడు అని లోకం కోడై కూసింది. ''అవును! తనవంటి కురూపిని అర్థాంగిగా చేసుకున్నవాడు ఇంతకంటే మెరుగ్గా ఎలా ప్రవర్తిస్తాడు? అలాంటపుడు వివాహం ఎందుకు చేసుకున్నాడు? యిదేమైనా నాటకంలో ''పాత్ర'' అనుకున్నాడేమో! చూడకుండా చేసుకున్నాడేమో అంటే అలా జరగలేదు చూసే చేసుకున్నాడు. ఇప్పుడున్న అయిష్టం ఆ నాడెందుకు లేకపోవాలి? డబ్బుకి కక్కుర్తిపడి ఒక అమాయకురాలి జీవితాన్ని నాశనం చేయాలనుకున్నాడేమో'' యిలా తనకు తాను ప్రశ్నించుకుంది రాధ.

రాధని అత్తవారింటికి పంపిస్తే కాపురం స్థిరపడుతుందేమోనని అక్కడికి పంపించారు. అక్కడా సుఖంలేదు. భర్తగారి చీదరింపులతో సరిపోతోంది. తన వయసుగల యువతులు వారి భర్తలతో ఎందరు హాయిగా ఉండటంలేదు? శోభనం గదిలో తన కర్తవ్యం తీర్చుకుందుకు రాధ పనికి వచ్చిందన్నమాట. అంటే మగవాళ్లు స్త్రీలయెడ అంత చులకనగా ఉంటున్నారు (ఈ రోజుల్లో). ఒక సంవత్సరం గిర్రున తిరిగింది.

రాధ గర్భవతి అయింది. ఇప్పుడైనా తనను గౌరవంగా చూస్తాడేమోనని చాల సంతోషించింది. తనకు కలుగబోయే శిశువును చూసైనా భర్త మారవచ్చు; యిలాగ ఎందరు మారటములేదు!

రాధకు తొమ్మిదోనెల రాగానే పుట్టింటికి తీసుకువచ్చారు. వచ్చిన మర్నాడే రాధ సుఖంగా ప్రసవించిరిది. సంతోషంతో

తన భర్తను తలచుకుంటూ బిడ్డకేసి చూచింది. హృదయం బ్రద్దలు ఐనట్లయింది. తన మాదిరి ముఖమే! ఏం అనుమానం లేదు, 'ఆడపిల్ల'—ఒక్కసారి తను అరచినట్టయింది. అంతే! శాశ్వత నిద్రలో లీనమైపోయింది అమాయకురాలు రాధ. ఇంటిల్లిపాది గొల్లుమన్నారు! శంకరం లోపల లోపల నవ్వుకున్నాడు!

—o✽o—

## గ్రామాభ్యుదయము

చదలవాడ సోదరీ కవయిత్రులు

పల్లెలు పట్టణములకున్
తల్లులు — సిరిసంపదలకు తావులు ; వానిన్
చల్లని చూపులఁ గనినన్
ఎల్లప్పుడు తిండి గుడ్డ లేర్పడు సుమతీ!

లేమిడి మాపెడి తెలివిడి
గ్రామీణుల కుందు నంచుఁ గన్గొని వడిగా
గ్రామాభ్యుదయమ్మునకై
నేమమ్ము వహింపఁదగును నేతలు సుమతీ!

ఎన్నో విద్యలు నేర్చిన
దున్నలచే హాలము దున్నఁ దొడఁగని యెడలన్
సున్న యగున్ మను జోన్నతి
మిన్నగదా! కర్షకుండు మేదిని సుమతీ!

కలమున్ హాలమున్ గైకొను
తెలివిం గలవారి సన్నుతింపఁగ వశమా?
కలమున్ గాని, హాలమున్ గని
చులకన యొనరించువారు శుంఠలు సుమతీ!

పల్లెల పాఁడిని పంటను
కొల్లగ భుజియించి వాని కొఱఁతలు తీర్పన్
ఉల్లాసపడరు నేతలు
చెల్లాచెదరగును దాన శ్రీగతి సుమతీ!

వ్యవసాయోన్నతికొఱకై
అవిరళ యత్నమ్మొనర్పనగుఁ గాదేనిన్
భువి నన్య పరిశ్రమములు
నవరింపవు జీవితావసరములు సుమతీ!

పాత్రుడు గారి
బాలసంజీవిని (Regd)
పిల్లల లివర్ అండ్ స్ప్లీన్ వ్యాధులను నివారించును
డాక్టరు పిల్లా పాపయ్య పాత్రుడు అండ్ బ్రదర్స్,
19, దక్షిణ మాడవీధి, మైలాపూరు, మదరాసు-4. Phone 71354
కుంభకోణము బ్రాంచి : 7. సారంగపాణి కోవిల తూర్పువీధి.
అన్ని మందుల షాపులలోను దొరకును.